క్లుప్తంగా

12 నుంచి పీఓ, ఏపీఓలకు శిక్షణ తరగతులు

కురుపాం: ఈ నెల 12 నుంచి స్థానిక ఆదర్శ పాఠశాలలో కురుపాం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన పోలింగ్, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వి.రమణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 12 నుంచి 16 వరకు నాలుగు రోజుల పాటు ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు శిక్షణ ఉంటుందన్నారు. పీఓలు, ఏపీఓలుగా నియమితులైన వారంతా శిక్షణ తరగతులకు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

పంటల పరిశీలన



పంటలు పరిశీలిస్తున్న డీపీఎం షణ్ముఖరాజు

కురుపాం: మండలంలోని పెద్దగొత్తిలి ఆర్‌బీకే, వలసబల్లేరు గ్రామాల్లో రబీలో సాగు చేస్తున్న పంటలను జిల్లా ఏపీసీఎన్‌ఎఫ్ డీపీఎం షణ్ముఖరాజు బుధవారం పరిశీలించారు. వేరుశెనగ, పొద్దుతిరుగుడు పంటలను పరిశీలించి ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బందికి, రైతులకు పలు సూచనలు చేశారు. పీఎండీఎస్ 21రకాల విత్తనాలను సాగుచేయడం ద్వారా భూమి సారవంతంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో మోడల్ మేకర్ కె.సన్నిదొర, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కళావతి ప్రచారం

భామిని: మండలంలో గురువారం పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి విస్తృత ప్రచారం చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తోట సింహాచలం, ఎంపీపీ తోట శాంతికుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిల్లుమడ, నేరడి–బి, గురండి, వడ్డంగి పంచాయతీల పరిధిలో ఎమ్మెల్యే కళావతి పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రచారం చేయనున్నారని తెలిపారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

పాలకొండ రూరల్: స్థానిక పోస్టాఫీస్ రహదారిలో 13 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న వీరఘట్టం మండలం పనస నందివాడకు చెందిన ధర్మారావును ఎస్‌ఐ ఎస్.ప్రశాంత్ కుమార్ అదుపులోకి తీసుకున్నారు. బుధవారం విజుబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఆ ప్రాంతాల్లో తనిఖీలు చేస్తుండగా ధర్మారావు నుంచి మద్యం బాటిళ్లు స్వాధీన పర్చుకుని, కేసు నమోదు చేయటంతో పాటు అరెస్టు చేసామని తెలిపారు.

గిరిజన గ్రామాల్లో నిరంతర వైద్య సేవలు



దోకిశీల గ్రామంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ ఐశ్వర్య

పార్వతీపురం టౌన్: గిరిజన గ్రామాల్లో నిరంతర వైద్యసేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి ఐశ్వర్య చెప్పారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని దోకిశీల గిరిజన గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో 80 మంది రోగులకు బుధవారం ఆమె వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు నియమితులయ్యారని, ఒకరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరొకరు ప్రజల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందిస్తారని చెప్పారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు వారి ఇళ్ల వద్దే వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. గ్రామాల్లో దాదాపు 13 రకాల వైద్య సేవలు అందిస్తున్నామని, 67 రకాల మందులు, 14 రకాల డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఎనిమిది రకాల రక్త పరీక్షలు నిర్వహించి రోగులకు నెలకు సరిపడా మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

5% పన్ను రాయితీని సద్వినియోగంచేసుకోవాలి

పార్వతీపురంటౌన్: 5% పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కోరారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్ను ఏక మొత్తంలో చెల్లించే వారికి ప్రభుత్వం 5% పన్ను రాయితీని కల్పించనుందని చెప్పారు. ఈ సదవకాశం ఈనెల 30వ తేదీ వరకు ఉందని, కావున పురప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. పన్ను చెల్లింపుదారులు పురపాలక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో గాని, సచివాలయాలు, మీ–సేవా కేంద్రంలో గాని పన్ను చెల్లించి రశీదును పొందాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలనుకున్నవారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీడీఎంఏ.ఏపీ.జీఓవీ.ఇన్ పేమెంట్ ఆప్షన్‌లో చెల్లించే వెసులుబాటు కల్పించామని వివరించారు.

మీకు మేలు జరిగితే మాకు ఓటేయండి



కొట్టు గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

- నియోజకవర్గంలో మరింత అభివృద్ధి చేస్తాం..
- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన ప్రతీ హామీ నెరివేర్చారని, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించారని, అందుకే మీకు మేలు జరిగిందని అనిపిస్తే రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతివ్వాలని ధైర్యంగా అడుగుతున్నామని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని కొట్టు, తొడుము, మాదలింగి, దళాయపీట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రచర్ల పరీక్షిత్‌రాజుతో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి సం



తొడములో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు

క్షేమ ఫలాలను ప్రతి ఇంటికి చేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మోసపూరిత హామీలతో 2014లో అధికారంలోకి చంద్రబాబు ఇప్పుడు మళ్లీ దొంగ హామీలతో మీ ముందుకు వస్తున్నారని, వారి మాయ మాటలకు మోసపోవద్దని హితవు పలికారు. ఇచ్చిన మాటకు కట్టుబడిన వ్యక్తి జగనన్న అని, మరోసారి ఆయన ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో మరింత సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మీరంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా నాకు, ఎంపీగా తనూజారాణిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కోవిడ్ విపత్తులో కూడా సంక్షేమం ఆగలేదు: పరీక్షిత్‌రాజు

కోవిడ్ విపత్తు సమయంలో కూడా గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ ఇంటికి సంక్షేమంతో పాటు వైద్యం అందేలా చూశారన్నారు. కురుపాం నియోజకవర్గం చరిత్రలో కనీవినీ ఎరగని అభివృద్ధిని ఈ ఐదేళ్లలో జరిగిందన్నారు. గిరిశిఖర గ్రామల్లో కోట్లాది రూపాయలతో తారురోడ్లు నిర్మాణం, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. విద్య, వైద్యంతో పాటు ప్రతీ గడపకు సంక్షేమం అందించిన ముఖ్యమంత్రి జగనన్నకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలిచి మళ్లీ ఆయన్ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తే నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, నాయకులు కళింగి మల్లేశ్వరరావు, శెట్టి మధుసూదనరావు, కొమరాడ, సివిని పీఏసీఎస్ అధ్యక్షులు మరడాన సూరపునాయుడు, పప్పల గోపాలకృష్ణ, మండల సచివాలయ కన్వీనర్ యేగిరెడ్డి సింహాచలం, ముంజి సరేష్, చింతల సంగంనాయుడు, పలువురు సర్పంచ్లు, ఎంపీటీసీలు, నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు

కొమరాడ: ఎండలు అధికంగా ఉన్నందున గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి వారికి వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథరావు అన్నారు. మండలంలోని కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. పీఎం ఎస్ఎంఏ(ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్) కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలు, పీఆర్ఐ ఎం–10 కార్యక్రమం అమలుపై ఆరాతీశారు. దత్తత తీసుకున్న అధికారి వస్తున్నారా లేదా..? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై



కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీలో గర్భిణులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎండలో బయటకు వెళ్లే వ్యక్తులు కచ్చితంగా టోపీ పెట్టుకుని, మంచినీరు పట్టుకుని వెళ్లాలని సూచించారు.

కోదండరామ స్వామికి ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా కోదండరామాలయంలో బుధవారం ఉదయం శ్రీరామ సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, రుత్విక్ వరుణ తదితర పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ, లక్ష్మీమంత్ర జపములు, శ్రీమద్రామాయణ పారాయణం చేపట్టారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 17న శ్రీసీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



పూజలందుకుంటున్న స్వామివారు

13న రామాలయ పునఃప్రతిష్ట

గరుగుబిల్లి: మండలంలోని కొంకడివరం పంచాయతీ సీతారాంపురం గ్రామంలో ఈనె 13న సీతారామ లక్ష్మణ ఆంజనేయ ఉత్సవ విగ్రహాల పునఃప్రతిష్ట మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 12 సాయంత్రం నుంచి పూజా కార్యక్రమాలను ప్రారంభించి, 13న ఉత్సవ విగ్రహాల పునఃప్రతిష్ట, కల్పవృక్షం ప్రతిష్ట తదితర కార్యక్రమాలను అర్చకులు కె.మురళీమోహన్ శర్మ పర్యవేక్షణలో చేపట్టనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ముమ్మరంగా తనిఖీలు

గుమ్మలక్ష్మీపురం: ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పోలీస్ ఉన్నతాధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల వేల ధన ప్రవహం, పంపిణీ చేసేందుకు తరలించే కానుకల ప్రవాహంకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద కేంద్ర బలగాలతో కలిసి ప్రతీ వాహనాన్ని క్షుణ్నంగా తనిఖీ చేస్తున్నారు. మండలంలోని ఆంధ్రా సరిహద్దు గ్రామమైన తాటిశీల వద్ద (గుణుపూర్ రోడ్డు) ఎల్విన్‌పేట పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టు వద్ద ఒడిశా నుంచి అక్రమంగా మద్యం, డబ్బు రాకుండా తనిఖీలు చేస్తున్నారు. రూ.50 వేలు మించి నగదు, బంగారం



తాటిశీల చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

, వెండి, ఇతర విలువైన వస్తువులు తీసుకు వెళ్తే వాటిని సీజ్ చేస్తున్నారు. సిఫ్టుల వారిగా విధులు నిర్వహిస్తూ.. నిఘా పటిష్టం చేశారు.

రోగులకు పౌష్టికాహారం వితరణ

సీతానగరం: మండలంలోని పెదంకలాం పీహెచ్‌సీలో వైద్య సేవలకోసం వచ్చిన రోగులకు బలిజిపేట మండలంలోని అజ్జాడ సత్యసాయి భక్తులు సమకూర్చిన పౌష్టికాహారాన్ని డాక్టర్ రాధాకాంత్ బుధవారం పంపిణీ చేశారు. ఈ మేరకు డాక్టర్ రాధాకాంత్ మాట్లాడుతూ అజ్జాడ గ్రామానికి చెందిన సత్యసాయి భక్తసమాజం కమిటీ సభ్యులు ప్రతి బుధవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తారని తెలియజేశారు. వైద్య సిబ్బంది సూచనల మేరకు అదే రోజు ఎంతమంది వైద్యసేవల నిమిత్తం రోగులు పెదంకలాం పీహెచ్‌సీకి వచ్చినా సత్యసాయి సేవా సమింతి తాజాగా



పెదంకలాం పీహెచ్‌సీలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ రాధాకాంత్

సమకూర్చిన ఆహారాన్ని అందజేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పాలకొండ రూరల్: ప్రస్తుత వేసవిలో ఉపాధి పనులు జరిగేచోట అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని అన్నవరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ గ్రామ పరిధిలో 17 గ్రూపులకు సంబంధించి పనులకు హాజరవుతున్న 152 మంది వేతనదారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం రోజువారీ వేతనం రూ.272 నుంచి రూ.300లకు పెరగటంతో కచ్చితంగా పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. క్షేత్ర సహాయకులు ఈ మేరకు వారిని నడిపించాలన్నారు.

సరిహద్దు భద్రత కీలకం



చెక్‌పోస్టును తనిఖీచేస్తున్న తహసీల్దార్ కె.ఆనందరావు

పార్వతీపురంటౌన్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల్లో భద్రత కీలకమని తహసీల్దార్ కె.ఆనందరావు, అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురంలోని వెంకంపేట గోరీల వద్దగల చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాలో భద్రత కీలకమన్నారు. పక్కా రాష్ట్రం ఒడిశా నుంచి గంజాయి, సారా, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై దృష్టిసారించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాలని కోరారు. ముఖ్యంగా ఎన్నికల నేపథ్యంలో ఒడిశా రాష్ట్రం నుంచి డబ్బు రవాణాపై దృష్టి సారిస్తూ ముందస్తు సమాచారం సేకరించాలని సూచించారు. అనుమానం ఉన్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై సంతోషి, ఆర్‌ఐలు రామకృష్ణ, నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం కూడదు

పార్వతీపురం టౌన్: ఎన్నికల విధుల్లో అలసత్వం వహించరాదని తహసీల్దార్ కె.ఆనందరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. తమ పరిధిలో అప్పగించిన విధులను అంకితభావంతో చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఎంసీసీ ఉల్లంఘనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

జనహోరు..

కళావతి ప్రచార జోరు



బద్దుమాసింగిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో కలసి విజయ నినాదాలు చేస్తున్న ప్రజా ప్రతినిధులు, ప్రజలు

- జంపరకోట, పొట్లి, ఎం.సింగుపురంలో ఎన్నికల ప్రచారం

పాలకొండ రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పాలన అందించిందని... ఇదే ఒరవడి కొనసాగించేందుకు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించాలని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పొట్లి, జంపరకోట, ఎం.సింగుపురం పంచాయతీల్లో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో కలసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజా ఆశీర్వాదంతో జగనన్న ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావాలంటే ఫ్యాన్ గుర్తుపై అమూల్యమైన ఓటును వేయాలని పల్లె ప్రజలను కోరారు. సంక్షేమం, అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమన్నారు. కేవలం అధికారం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కూటమి కట్టాయని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. సదరు నాయకులు తప్పుడు ఆరోపణలు, ప్రచారాలు చేస్తూ కాలకూటమి విషాన్ని కక్కుతున్నారని మండిపడ్డారు. ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

జనహోరు

ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిత పొట్లి వెళ్లిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతికి సర్పంచ్ గొర్లె కృష్ణ, ఎంపీటీసీ పాండ్రింకి హైమావతి, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మహిళలు అడుగడునా ఎదురొచ్చి హారతులు పట్టారు. బద్దుమాసింగిలో సర్పంచ్ ఆరిక వెంటేష్, ఎంపీటీసీ మంగమ్మల నేతృత్వం అక్కిరాజుపేట, జంపరకోట, వెంకరాయునివలస గ్రామంలో గిరిజన మహిళలు పూల వర్షం కురిపించారు. అనంతరం ఎం.సింగుపురం పంచాయితీలో అడుగుపెట్టగానే సర్పంచ్ రణస్థలం రామాదేవితో పాటు బియ్యాలవలస, మల్లివీడు, సింగుపురం ప్రజలు పెద్దసంఖ్యలో ఎదురు వచ్చి పూలమాలలు వేసి ఆహ్వానం పలికారు. ప్రచారంలో ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీ, మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్‌తో పాటు పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పీఏసీఎస్ అధ్యక్షుడు నల్లి శివప్రసాద్, మండల వ్యసాయ సలహా మండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

కొమరాడ: మండలంలోని శిఖవరం గ్రామం నుంచి సుమారు 30 గిరిజన కుటుంబాలు బుధవారం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. మాదలింగిలో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో వారంతా టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి ప్రజలకు సంక్షేమ పాలన అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటే తామంతా నడుస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణినికి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, నాయకులు శెట్టి మధుసూదనరావు, పలువురు గిరిజన యువత పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

ముందస్తు కొలతలు ఇవ్వాలి

గరుగుబిల్లి: వేతనదారులకు ముందస్తు కొలతలు ఇచ్చి ఉపాధి పనులను వేతనదారులతో చేయించాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ జి.శ్రీహరిరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ నెలాఖరు నాటికి వేతనదారులకు లక్షాడబ్బైవేల పనిదినాలను కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని సిబ్బందికి సూచించారు. మండలం నుంచి రోజుకు 7వేలమంది ఉపాధి పనుల్లో పాల్గొనేలా చూడాలన్నారు. వేతనదారుల హాజరును ఎస్ఎంఎస్ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు పంపించాలన్నారు. ఏప్రియల్ నెల నుంచి గరిష్ట వేతనం రూ.300లకు పెంచడం జరిగిందన్నారు. ఎంపీడీఓ పి.సూర్యనారాయణ మాట్లాడుతూ.. రెండు పూటలా పనులు చేయాలని,



మాట్లాడుతుతున్న ఏపీడీ శ్రీహరిరావు

ఎండల తీవ్రత కారణంగా ఉదయం 10 గంటల లోపు పనులను ముగించుకోవాలన్నారు. సాయంత్రం 4 గంటల తరువాత పనులలో పాల్గొనాలన్నారు. పని ప్రదేశంలో అవసరమైన తాగు నీరు, టెంట్లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏపీఓ ఎం.గౌరీనాద్, జేఈ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

• వలంటీర్ల రాజీనామా



చలివేంద్రి సచివాలయం వద్ద తమ రాజీనామాలు పంచాయతీ కార్యదర్శికి అందజేస్తున్న వలంటీర్లు

వీరఘట్టం: మండలంలోని చలివేంద్రి, బూరుగ, మహదేవివలస, కంబర, నడుకూరు, కంబరవలస పంచాయతీలకు చెందిన 48 మంది వలంటీర్లు బుధవారం రాజీనామాలు చేశారు. ఆయా సచివాలయాల పరిధిలో ఉన్న పంచాయతీ కార్యదర్శులకు తమ రాజీనామాలు అందజేశారు. చలివేంద్రి సచివాలయం పరిధిలో 21 మంది, నడుకూరు సచివాలయం పరిధిలో 13 మంది, కంబర సచివాలయం పరిధిలో 14 మంది రాజీనామాలు చేశారు. టీడీపీ కూటమి చేస్తున్న అసత్య ప్రచారాల వల్ల తామంతా రాజీనామాలు చేస్తున్నట్లు వలంటీర్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో తామంతా జగనన్న వెంటే ఉంటామన్నారు.

కోడ్ పక్కాగా అమలు

సీతంపేట: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో పొందుపర్చబడిన అన్ని నియమ, నిబంధనలు పక్కాగా అమలు చేయాలని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి అన్నారు. స్థానిక ఐటీడీఏలో అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమౌతుందన్నారు. నామినేషన్ వేసేటప్పుడు అభ్యర్థులు నిబంధనల్లో పేర్కొన్న అన్ని పత్రాలను పొందుపర్చాలన్నారు. పార్టీల ప్రచారాలకు సంబందించి ముందస్తుగానే రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. నాలుగు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

• గిరిజన గ్రామాలకు పక్కా రహదారి



గతంలో నడవడానికి వీల్లేని బిచ్చుమానుగూడ మట్టి రోడ్డు



పాలవలస నుండి బిచ్చుమానుగూడకు వేసిన తారు రోడ్డు

భామిని మండలంలోని పాలవలస నుంచి బిచ్చుమానుగూడ వరకు పక్కా రహదారి వేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డుపై నడిచేందుకు కూడా పాదచారులు సైతం అవస్థలు పడేవారు. నేడు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సుమారు 11.50 కిలోమీటర్ల మేర రూ.7.18 కోట్లతో ఏడు గిరిజన గ్రామాలను కలుపుతూ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిధులతో ఈ రహదారి పూర్తవడంతో గిరిజనులు సంతోషపడుతున్నారు. తమ రహదారి కష్టాలు తీరాయని సంబరపడుతున్నారు.

– భామిని